సాక్షి
జగిత్యాల
గురువారం ; 7 ; మార్చి ; 2024



తహసీల్దార్ కార్యాలయానికి తాళం

జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయానికి బుధవారం భవన యజమాని తాళం వేశాడు. 8లో▸



సంతోషం.. అంతలోనే విషాదం

భార్య రెండు ఉద్యోగాలు సాధించడంతో స్నేహితులు పార్టీ అడిగారు. వారికి విందు ఇచ్చేందుకు వెళ్లిన గంటలోనే రోడ్డు ప్రమాదం కబళించింది. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
37.0/23.0

వాతావరణం పొడిగా ఉంటుంది. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై కనిపిస్తుంది. మధ్యాహ్నం ఎండవేడిమి కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ముగ్గురు విద్యార్థులు డిబార్

జగిత్యాల: ఇంటర్ ఫస్టియర్ జనరల్ విద్యార్థులకు బుధవారం జరిగిన మ్యాథ్స్, బాటనీ, హిస్టరీ పరీక్షలకు 4,436 మందికి 4,310మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,130 మందికి 970 మంది హాజరయ్యారు. కొడిమ్యాలలోని ఇంటర్ పరీక్ష కేంద్రంలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ముగ్గురు విద్యార్థులను సిట్టింగ్ స్క్వాడ్స్ డిబార్ చేశారని నోడల్ అధికారి నారాయణ తెలిపారు.

10 వరకు మార్కెట్ యార్డుకు సెలవు

మెట్‌పల్లి: ఈనెల ఏడో తేదీ నుంచి 10 వరకు మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించినట్లు కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈమేరకు మార్కెట్‌లో పసుపు కొనుగోళ్లు ఉండవని, రైతులు సహకరించాలని, 11 నుంచి యథావిధిగా కొనుగోళ్లు ఉంటాయని వివరించారు.

బైపాస్‌ను దారి మళ్లిస్తే ఆత్మహత్యలే



ఆందోళన చేస్తున్న రైతులు

జగిత్యాలరూరల్: నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా బైపాస్‌రోడ్‌ను దారి మళ్లిస్తే తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆందోళనకు దిగారు. పాత ప్లాన్ ప్రకారమే బైపాస్ వేయాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట రైతులు జగిత్యాల–ధర్మపురి ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. ఎన్‌హెచ్–63 బైపాస్‌రోడ్ 3ఏను పబ్లిష్ అయిన విధంగానే ఏర్పాటు చేయాలని, దారి మళ్లిస్తే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

కుష్టు నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న శ్రీధర్

జగిత్యాల: కుష్టు నిర్మూలన అందరి బాధ్యతని డీఎంహెచ్‌వో శ్రీధర్ అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో లెప్ర ఇండియా అమెరికన్ లెప్రసీ మిషన్ ఆధ్వర్యంలో అధికారులతో సమావేశమయ్యారు. కుష్టువ్యాధి పురాతనమైనదని, వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి సత్వర చికిత్స అందించాలని, వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రాజెక్ట్ అధికారి కామేశ్వర్ రావు, నర్సింహస్వామి, జైపాల్‌రెడ్డి, సమియోద్దీన్ పాల్గొన్నారు.

కొండగట్టులో గదుల టెండర్ పూర్తి

కొండగట్టు(చొప్పదండి): దిగువ కొండగట్టులోని మెయిన్ రోడ్ వద్ద ఉన్న అంజన్నస్వామివారి 15 గదుల సముహానికి బుధవారం ఆలయ ఈవో వెంకటేశ్ సమక్షంలో టెండర్లు నిర్వహించారు. 15 గదులకు గాను వచ్చేనెల ఒకటో తేదీ నుంచి 31 మార్చి 2025 వరకు టెండర్ ఆహ్వానించారు. ఇందులో 3, 10 నంబర్ల గదులకు టెండర్లు కాలేదు. మిగిలిన గదులకు రూ.5,27,350 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్లు శ్రీనివాస శర్మ, సునీల్, టెండర్ల ఇన్‌చార్జి ఉమామహేశ్వర్, అధికారులు రవికిషన్, ధర్మేందర్, టెండర్‌దారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన దుబ్బరాజన్న బ్రహ్మోత్సవాలు



అంకురార్పణ, పుణ్యాహవచనంలో అర్చకులు

సారంగాపూర్: మండలంలోని దుబ్బరాజన్న ఆలయ జాతర బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. గణపతి పూజతోపాటు నవధాన్యాలను పాలకల్లో (కుమ్మరి కుండల్లో నానబెట్టి) పోసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో అనూష్, వ్యవస్థాపక ధర్మకర్త శంకరయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి 9 గంటలకు స్వామివారి కల్యాణం జరగనుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తాం..

- 2025 డిసెంబర్ వరకు ప్రక్రియ ప్రారంభిస్తాం..
- 15రోజులకోసారి అధికారుల బృందం పర్యటన
- ఫ్యాక్టరీలు లాభాల్లోకి రావాలంటే చెరుకు విస్తీర్ణం పెరగాలి
- రైతులు కోరుకున్న మార్పుతోనే అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు
- ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ సందర్శన, రైతులతో ముఖాముఖి



ముఖాముఖిలో మాట్లాడుతున్న పునరుద్ధరణ కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, సంజయ్, సంజయ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్ బాషా

మల్లాపూర్: మూతపడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీలను 2025 అక్టోబర్ లేదా డిసెంబర్ వరకు ప్రారంభిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు ప్రకటించారు. మండలంలోని ముత్యంపేట శివారులోగల నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరణ కమిటీ, స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి బుధవారం సందర్శించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతులు, స్థానిక ఎమ్మెల్యేల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రైతులు కోరుకున్న మార్పుతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, వారి మనోభావాలకు అనుగుణంగా నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తిరిగి ప్రారంభించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఫ్యాక్టరీలు తెరిచాక లాభాలబాటలో పయనించేలా ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తామన్నారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణతో పరిస్థితులు ఎలా ఉంటాయి..? ముందుస్తుగా చేపట్టాల్సిన చర్యలేమిటి..? అంశాలను రైతుల నుంచి అభిప్రాయాలు తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. చెరుకుపంట దిగుబడి తక్కువ ఉండడమే ఫ్యాక్టరీల మూసివేతకు కారణమని గత ప్రభుత్వం చెప్పిందని, రైతులు ఆధునాతన పద్ధతులతో ఎకరాకు 70 నుంచి 80 టన్నులు వచ్చేలా సాగు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఫ్యాక్టరీ పరిధిలో 1040 ఎకరాలు సాగవుతోందని, 83వేల టన్నుల చెరుకు మాత్రమే ఉత్పత్తి అవుతుందని, 10వేల ఎకరాలకు విస్తరించాలని తెలిపారు. రైతులకు లాభం చేకూరేలా ప్రభుత్వం ఇథనాయిల్ ఫ్యాక్టరీని ఇక్కడ ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోందన్నారు. ఫ్యాక్టరీలు తెరుచుకునే వరకు 15రోజులకోసారి అధికారుల బృందం పర్యటిస్తుందన్నారు. తాము మాటలు తక్కువ చెప్పి, చేతల్లో ఎక్కువ పనులు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్‌కుమార్, సంజయ్‌కుమార్, భూపతిరెడ్డి, పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, షుగర్‌కేన్ కమిషనర్ మల్సూర్, కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా, ఆర్డీవో శ్రీనివాస్, ఎన్‌డీఎస్‌ఎల్ సీఈవో సుబ్బరాజు, రైతు సంఘం నాయకులు మామిడి నారాయణరెడ్డి, తుల రాజేందర్ రావు, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, న్యావనంది లింబారెడ్డి, గోరుమంతుల ప్రవీణ్‌కుమార్, వంగ అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

మామిడి నారాయణరెడ్డి దీక్ష విరమణ

ఫ్యాక్టరీ పునరుద్ధరించే వరకూ చెప్పులు వేసుకోనని, ఒకపూట మాత్రమే భోజనం చేస్తానని దీక్ష చేపట్టిన చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డితో మంత్రి దీక్ష విరమింపజేశారు. ముందుకు రైతు ముఖాముఖి వేదికపైకి పిలవకపోవడంతో నారాయణరెడ్డి పలువురు రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. వేదిక వద్ద కింద కూర్చొని అసంతృప్తి వెలిబుచ్చారు.

ఎస్సీ ఉపకులాలను ఆదుకోవాలి

ఎస్సీ ఉపకులాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని మాస్టీన్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుద్దుల గంగనర్సయ్య అన్నారు. ఈ మేరకు మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఉపకులాలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు.

జీవో 317 బాధితులకు న్యాయం చేయండి

జగిత్యాలటౌన్: జీవో 317 బాధితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్నాథ్ రెడ్డి, ఆనందరావు మంత్రిని కోరారు. ఈ మేరకు శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. వీలైనంత త్వరగా ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

చిక్కుముడులు అధిగమిస్తాం..

జగిత్యాలటౌన్: ముత్యంపేటలోని షుగర్ ఫ్యాక్టరీ చిక్కుముడులన్నీ అధిగమిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎంసీహెచ్ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. మేనిఫెస్టోలోని ప్రతి హామీనీ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడానికి ప్రభుత్వం వేసిన కమిటీ చెరుకు రైతులు, అధికారులతో ఇప్పటికే చర్చలు జరిపిందన్నారు. గతంలో ఫ్యాక్టరీని నిర్వహించిన యాజమాన్యంతోనూ సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు జరిపారని గుర్తు చేశారు. షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించడమే కాకుండా ప్రభుత్వ చొరవతో విలువ ఆధారిత పరిశ్రమగా మార్చే ఆలోచన చేస్తున్నామని వెల్లడించారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబుకు పోలీసులు గౌరవవందనం చేశారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా, అధికారులు స్వాగతం పలికారు. సమావేశంలో బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, కొత్త మోహన్, విజయలక్ష్మి, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, గాజంగి నందయ్య పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన రైతులు



కిందకూర్చున్న నారాయణరెడ్డి, తదితరులు

‘ఎల్‌ఆర్‌ఎస్’పై బీఆర్‌ఎస్ పోరు



ధర్మపురిలో రస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- బల్దియా కార్యాలయం ఎదుట నిరసన

జగిత్యాలటౌన్: ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) ఫీజు రద్దు చేసి ఉచితంగా అమలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా బుధవారం జగిత్యాల బల్దియా కార్యాలయం ఎదుట నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శించారు. గేట్ ముందు బైఠాయించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు ఫీజు మినహాయింపు ఇచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బల్దియా కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మపురిలో జాతీయ రహదారిపై

ధర్మపురి: ధర్మపురిలో జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే నో ఎల్‌ఆర్‌ఎస్ అని రేవంత్‌రెడ్డి, ఉత్తమకుమార్‌రెడ్డి హామీ ఇచ్చారని, ఇప్పుడు ఫీజు వసూలు చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై ఉదయ్‌కుమార్ సిబ్బందితో అక్కడకి చేరుకొని ధర్నాను విరమింపజేసారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, నాయకులు మొగిలి శేఖర్ పాల్గొన్నారు.



జగిత్యాల బల్దియా ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

అడవిని తలపిస్తున్న కళాశాల ఆవరణ

- పాములు..తేళ్ల ఆవాసం
- గ్రూపుల పోరుతో కళాశాలకు నష్టం
- కోరుట్ల డిగ్రీ కళాశాల తీరు..



అడవిని తలపిస్తున్న కళాశాల ఆవరణ

కోరుట్ల: కళాశాల చుట్టూ ప్రహరీ లేదు.. ఎటు చూసినా అడవిని తలపించే వాతావరణం.. పాముల పుట్టలు.. విష పురుగులు..తేళ్ల సంచారం. పేరుకుపోయిన దుమ్ముధూళితో అపరిశుభ్రంగా ఉన్న తరగతి గదులు. దీనికి తోడు అధ్యాపకులు.. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మధ్య ప్రచ్ఛన్నపోరు. ఇదీ మొత్తంగా కోరుట్ల డిగ్రీ కళాశాల దుస్థితి.

న్యాక్ గుర్తింపు ఉన్నా..

అర్ధ శతాబ్దం ప్రత్యేకతను కలిగిన కోరుట్ల డిగ్రీ కళాశాలకు ఇటీవల నాక్ ‘బీ’ గ్రేడ్ గుర్తింపు వచ్చింది. ఈ క్రమంలో పీఎం ఉషా (ప్రధాన మంత్రి ఉచ్ఛతర్ శిక్ష అభియాన్) పథకం కింద కేంద్రం నుంచి కళాశాలకు యూజీసీ గ్రాంట్స్ మంజూరు అవుతాయి. ఏటా సుమారు రూ.2కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు నిధులు వస్తాయి. ఈ నిధులతో కళాశాలలో ఆధునిక వసతులు, ప్రత్యేక ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, అవసరమైన తరగతి గదులు, అదనపు యాక్టివిటీస్ కోసం నిధులు కేటాయించే అవకాశం ఉంటుంది. సాధారణంగా న్యాక్ గుర్తింపు రావడం కష్టంకాగా..సుమారు రెండేళ్ల క్రితమే ఈ కళాశాలకు న్యాక్ గుర్తింపు వచ్చింది. అయినా కళాశాల పరిస్థితిలో ఏ మాత్రం మార్పు లేదు. లెక్చరర్లు..అధ్యాపకులు మధ్య సమన్వయ లోపంతోనే కళాశాల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గ్రూపుల పోరు..

కొంతమంది అధ్యాపకులు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మధ్య సమన్వయ లోపంతో విద్యార్థులకు సరైన వసతులు, ఇతరత్రా అవకాశాలు కనుమరుగవుతున్నాయన్న వాదనలు ఉన్నాయి. ఏడాదికాలంగా ఇరువర్గాల వారు ఒకరి లోపాలు మరొకరు ఎత్తిచూపించుకునే పనిలో ఉండటం.. ఫిర్యాదులు చేసుకోవడం.. లోటుపాట్లను సర్దుబాటు చేసుకుని విద్యార్థుల భవిష్యత్‌ను చక్కగా తీర్చిదిద్దడానికి కలిసి ముందుకు కదలకపోవడం సమస్యగా మారింది. ఈ పోరులో ఎవరివాదన సరైందన్న విషయంలో ఉన్నతాధికారులెవరూ ఇప్పటివరకు చొరవ తీసుకుని విచారణ జరపకపోవడం మరో సమస్యగా మారింది. కళాశాల నిర్వహణ, అభివృద్ధి విషయంలో అందరితో సమన్వయపరచడానికి చొరవ తీసుకోవాల్సిన ప్రిన్సిపాల్ ఏకపక్షంగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

న్యాక్ నిధులు.. ప్రతిపాదనలకే పరిమితం..

కళాశాలలో అధ్యాపకుల గ్రూపుల పోరుతో విద్యార్థులకు అకాడమిక్ పరమైన సమస్యలు.. పాములు, తేళ్లతో నిండి అడవిని మించిన పరిసరాలను సరిచేసే దిశగా చర్యలు చేపట్టేవారు కరువయ్యారు. చివరికి న్యాక్ పీఎం ఉషా పథకం కింద రూ.5 కోట్లు నిధులు కావాలని ఏడాది క్రితం ప్రతిపాదించినా ముందుకు కదలించేలా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు తీవ్ర అసహనానికి లోనై తమ సమస్యలను ఏకరువు పెడుతూ ఏకంగా వీడియోలు తీసి డిగ్రీ కళాశాలల కమిషనర్‌కు పంపడం.. అది వైరల్ కావడంతో చర్చనీయంగా మారింది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని డిగ్రీ కళాశాల దుస్థితిని సరిచేసి విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రిన్సిపాల్ గది ఎదురుగా పాములపుట్ట



కళాశాల మెట్లపై పేరుకుపోయిన చెత్త

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. బుధవారం స్థానిక బల్దియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. పారిశుధ్యం మెరుగు కోసం కొత్తగా 12ఆటోల కొనుగోలుకు రూ.1.20కోట్లు, నీటిసరఫరా, వీధిదీపాలు, కార్మికుల కొనసాగింపు, వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ఏర్పాట్లకు రూ.42లక్షలు కేటాయించామన్నారు. మొత్తం 14 అజెండా అంశాలను ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరు

బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 23 మంది కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ఇటీవల జరిగిన చైర్‌పర్సన్ ఎన్నికల్లో రెబల్‌కు ఓటు వేసిన వారు మాత్రమే హాజరయ్యారు. కోరం ఉండటంతో సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాకపోవడం శోచనీయమని బీజేపీ ఫ్లోర్ లీడర్ కృష్ణహరి అన్నారు. శానిటేషన్ విభాగంలో అవినీతి జరుగుతోందని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య అన్నారు. ముందుగా చైర్‌పర్సన్ అడువాల జ్యోతిని సభ్యులు సన్మానించారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

వానాకాలం నుంచి పంటల బీమా


- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, రైతులు

సారంగాపూర్/ఇబ్రహీంపట్నం: పంటల బీమా పథకాన్ని వానాకాలం నుంచి ప్రభుత్వమే అమలు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం సారంగాపూర్ రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా ఆధునిక సాంకేతిక వ్యవసాయ విధానాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. రైతునేస్తం శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం అందించేలా రైతులు, శాస్త్రవేత్తలతో ప్రతి మంగళవారం, శుక్రవారం ముఖాముఖి నిర్వహిస్తామని, ఆన్‌లైన్‌లో వ్యవసాయంపై శిక్షణ ఉంటుందని వెల్లడించారు. సారంగాపూర్‌లో వీడియోకాన్ఫరెన్స్‌కు సాంకేతిక సమస్య ఏర్పడడంతో ముఖ్యమంత్రి నేరుగా తన ఫోన్ నుంచి రైతులతో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కల్పన, ఏవోలు తిరుపతినాయక్, ముతీశ్వర్, ఏఈవోలు వెంకటేష్, సందీప్, రాజేశ్, మతాయి, నాగరాజు, హరీశ్ పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం రైతు వేదికలో అడిషనల్ కలెక్టర్ దివాకర, జిల్లా వ్యవసాయ అధికారి వాణి, కోరుట్ల డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రమేశ్, తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాగాలయం వద్ద ఉద్రిక్తత



రాయికల్: మండలంలో కొత్తపేట నాగాలయం బోర్డుపై శివాజీనగర్ (ఒడ్డెరకాలనీ) పేరు పెట్టాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఆలయ భూములపై తమ గ్రామానికి వాటా కూడా ఉందన్నారు. సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై అజయ్, తహసీల్దార్ ఖయ్యూం, ఈవో విక్రమ్ కొత్తపేట, శివాజీనగర్ గ్రామస్తులతో సమావేశమయ్యారు. శివాజీనగర్ పేరును కేవలం బోర్డుపైనే పెట్టాలని కోరుతున్నామని, ఇందుకు కొత్తపేట గ్రామస్తులు అంగీకరించకపోవడమేంటని ప్రశ్నించారు. దీనిపై కొత్తపేట గ్రామస్తులు మాట్లాడుతూ.. ఏళ్లతరబడి ఆలయం బోర్డుపై గెజిట్ ప్రకారం తమ గ్రామం పేరు ఉందని చెప్పడంతో ఇరు గ్రామాల నాయకుల మధ్య వాగ్వివాదం చెలరేగింది. సీఐ ఆరీఫ్‌ఖాన్ మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎవరైనా ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమస్య ఉంటే ఎండోమెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

యాసంగి పంట లెక్క తేలింది

- 3.36 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- అత్యధికంగా 2.97లక్షల ఎకరాల్లో వరి
- 39,146 ఎకరాల్లో ఆరుతడి
- జిల్లా వ్యవసాయ శాఖ వెల్లడి

జగిత్యాలఅగ్రికల్చర్: యాసంగిలో జిల్లాలో 3.36 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఇందులో ఒక్క వరి పంటే 2,97,654 ఎకరాలతో మొదటి స్థానంలో.. 26,102 ఎకరాల్లో మొక్కజొన్న, 8,585 ఎకరాల్లో నువ్వులు, 991ఎకరాల్లో జొన్న, 770 ఎకరాల్లో ఎర్రమిరప, 625 ఎకరాల్లో సజ్జ, 623 ఎకరాల్లో కూరగాయలు, 546ఎకరాల్లో వేరుశనగ, 366ఎకరాల్లో చెరుకు, 275ఎకరాల్లో ఆవాలు పండిస్తున్నట్లు వ్యవసాయ శాఖ లెక్క తేల్చింది.

ఆన్‌లైన్‌లో సాగు వివరాలు

జిల్లాలోని 71 క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయి పర్యటనలు చేసిన ఏఈఓలు రైతుల నుంచి పంటల వివరాలు తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పంటలు అమ్ముకునే సమయంలో ఇబ్బంది రాకుండా వివరాలను అధికారులు సేకరించారు. బావుల, బోర్లలో నీరు పుష్కలంగా ఉండడం, ఎస్సారెస్పీ నుంచి నీరు విడుదల అవుతుండడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

వరి వైపే మొగ్గు

జిల్లాలోని రైతులు వరి వైపే మొగ్గు చూపారు. గత వానాకాలంలో 2.92లక్షల ఎకరాలు సాగు చేయగా.. యాసంగిలో మరో 5వేల ఎకరాలు పెరిగి 2.97లక్షల ఎకరాలకు చేరింది. మండలాల వారీగా పరిశీలిస్తే.. గొల్లపల్లిలో అత్యధికంగా 23,740 ఎకరాలు, మేడిపల్లిలో 22,555, పెగడపల్లిలో 21,400, వెల్గటూర్‌లో 11,554, ఎండపల్లిలో 11,200, మల్లాపూర్‌లో 19,010, మెట్‌పల్లిలో 20,731, కథలాపూర్‌లో 19,583, జగిత్యాల రూరల్‌లో 18,161, ధర్మపురిలో 16,485, రాయికల్‌లో 17,300, కొడిమ్యాలలో 17,370, కోరుట్లలో 16,750, ఇబ్రహీంపట్నంలో 12,475, సారంగాపూర్‌లో 11,450, మల్యాలలో 12,752, బీర్‌పూర్‌లో 11,520, బుగ్గారంలో 9,468, జగిత్యాల అర్బన్‌లో 4,150 ఎకరాల్లో వరి సాగవుతోంది. దీంతో జిల్లాలో ఎక్కడ చూసిన పచ్చదనమే కనబడుతుంది.



జిల్లాలో సాగవుతున్న వరి పంట

వరి విస్తీర్ణం పెరిగింది



జిల్లాలో నీటి వనరులు పుష్కలంగా ఉండటంతో సాగు విస్తీర్ణం పెరిగింది. మొత్తం 3.36లక్షల ఎకరాల్లో అన్ని పంటలు సాగవగా.. కేవలం వరి మాత్రమే 2.97లక్షల ఎకరాల్లో సాగవుతోంది. వరి సాగు తగ్గించి ఇతర పంటల వైపు రైతుల దృష్టి మరల్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

– వాణి, జిల్లా వ్యవసాయాధికారి

అంతంతమాత్రంగానే మిగిలిన పంటలు

జిల్లాలో ఆరుతడి పంటలైన పప్పుదినుసులు, నూనెగింజలు, వాణిజ్య పంటలను కేవలం 39,146 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ముత్యంపేట చెరుకు ఫ్యాక్టరీ మూతపడినా 366 ఎకరాల్లో చెరుకు సాగు చేయడం గమనార్హం. చెరుకును కామారెడ్డి ప్రైవేట్ చక్కెర ఫ్యాక్టరీకి తరలిస్తున్నారు.

క్లుప్తంగా

రైలు కిందపడి ఒకరి మృతి


ముకుందరావు (ఫైల్)

జమ్మికుంట: మండలంలోని పాపయ్యపల్లి గ్రామానికి చెందిన బిస్సాడి ముకుందరావు (58) రైలు కింద పడి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. బుధవారం రాత్రి గ్రామ సమీపంలోని రైల్వేగేటు వద్ద రైలు కింద పడి మృతి చెందాడని, మృతుడికి భార్య అరుణ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. రామగుండం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ గంగారపు తిరుపతి ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేస్తామని తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలకుర్తి మండలం ఎల్కలపల్లి గేట్ గ్రామంలో బుధవారం మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా చింతలదాబాకు చెందిన అక్షయ్ సదాశివ్ కుంబరే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రిక్ కంపెనీలో పనిచేస్తున్న అక్షయ్ సదాశివ్ కుంబరే మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల అతని స్నేహితుడు మృతి చెందగా స్వగ్రామానికి వెళ్లివచ్చి స్నేహితుడి మృతి తట్టుకోలేక మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి సదాశివ కుంబరే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ ఎస్సై టి.ఉదయ్‌కిరణ్ తెలిపారు.

ఇంటికి చేరిన వలస జీవి మృతదేహం


శ్రీకాంత్ (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం మలేషియా వెళ్లిన మండలంలోని కొలనూర్‌కు చెందిన సుదమల్ల శ్రీకాంత్ (33) అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోగా.. మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. శ్రీకాంత్ గత జనవరి 22న పక్షవాతానికి గురికాగా.. సరైన వైద్యం అందలేదు. పక్షవాతంతో బాధపడుతున్న శ్రీకాంత్‌ను తీసుకొచ్చేందుకు కుటుంబీకులు మలేషియా వెళ్లినా తీసుకొచ్చేందుకు అక్కడి కంపెనీ అంగీకరించలేదు. దీంతో కుటుంబ సభ్యులు స్వదేశానికి తిరిగొచ్చారు. కాగా ఫిబ్రవరి 22న శ్రీకాంత్ మృతిచెందాడు. మృతునికి భార్య లహరి, కూతురు ప్రణీత(3), కుమారుడు శ్రీహన్స్(18 నెలలు) ఉన్నారు.

11న విదేశీ ఉద్యోగ నియామకాలపై అవగాహన

పెద్దపల్లిరూరల్: విదేశీ ఉద్యోగ నియామకాలపై ఈనెల 11న సికింద్రాబాద్ ముషీరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీ మినీ ఆడిటోరియంలో టామ్‌కాం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ క్రింద రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కాం) అవగాహన కార్యక్రయం నిర్వహిస్తోందన్నారు. 21-38 ఏళ్ల వయస్సు కలిగి బీఎస్సీ అర్హత గల నర్సింగ్ గ్రాడ్యుయేట్లు, జీఎన్ఎం డిప్లొమా హోల్డర్లు నర్సింగ్ కేరీర్ అవకాశాల కోసం హాజరు కావాలని సూచించారు. జర్మన్ భాషపై నివాస శిక్షణ, జర్మనీలో పని చేయడానికి అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలను టామ్ కాం ద్వారా ఎంపిక చేయబడిన అభ్యర్థులకు హైదరాబాద్‌లో అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల నర్సింగ్ అభ్యర్థులు సెల్ నంబర్ 9908830438, 6302292450, 8919047600, 7901290580 నందు సంప్రదించాలని పేర్కొన్నారు.

సంతోషం.. అంతలోనే విషాదం

- రెండు ఉద్యోగాలు సాధించిన భార్య
- విందు ఇవ్వాలని కోరిన స్నేహితులు
- ఇంటి నుంచి వెళ్లిన గంటకే రోడ్డు ప్రమాదం
- ముందునుంచి వేగంగా వచ్చి కబళించిన లారీ
- అక్కడికక్కడే దుర్మరణం.. మరొకరికి తీవ్ర గాయాలు


రాజశేఖర్ (ఫైల్)


ధర్మపురిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మపురి: భార్య రెండు ఉద్యోగాలు సాధించడంతో స్నేహితులు పార్టీ అడిగారు. వారికి విందు ఇచ్చేందుకు వెళ్లిన గంటలోనే రోడ్డు ప్రమాదం కబళించింది. దీంతో ఆ ఇంట్లో విషాదం నిండింది. ఈ ఘటన ధర్మపురిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. ధర్మపురి పట్టణంలోని గంగపుత్ర కాలనీకి చెందిన నర్మల రాజశేఖర్ (36) బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. రాజశేఖర్ భార్య మనీషా ఇటీవల ప్రకటించిన టీజీటీ, పీజీటీలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. దీంతో పార్టీ (దావత్) ఇవ్వాలని తోటి మిత్రులు కోరారు. మంగళవారం సాయంత్రం బీర్‌పూర్‌లో విధులు ముగించుకుని ఇంటికి చేరిన రాజశేఖర్ నిద్రకు ఉపక్రమించాడు. అదే సమయంలో తన స్నేహితుడైన ధర్మపురికి చెందిన సిరుప బద్రి ఇంటి కొచ్చి పార్టీ కోసమని ద్విచక్రవాహనంపై మండలంలోని రాయపట్నం గ్రామానికి వెళ్లారు. విందు చేసుకుని తిరిగి వస్తుండగా బూరుగుపల్లె బస్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ అతి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజశేఖర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సిపతి బద్రి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు.

ఇంటి నుంచి వెళ్లిన గంటలోపే..

ఇప్పుడే వస్తానంటూ రాజశేఖర్ మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు ఇంటి నుంచి బయల్దేరాడు. వెళ్లిన కొద్దిసేపటికే పార్టీ ముగించుకుని తిరుగు పయనమయ్యారు. అంతలోనే ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో భార్య, తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. రాజశేఖర్‌కు కుమారుడు శ్రీహర్ష ఒక్కగానొక్క కుమారుడు. అతడు తండ్రి చితికి నిప్పు పెట్టడం అక్కడున్న వారిని కలిచివేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు.

అమ్మా.. నాన్నకు ఏమైంది..?

- గుండెపోటుతో తండ్రి మృతి
- దిక్కులు చూస్తున్న పిల్లలు


రవి (ఫైల్)


అమాయకంగా చూస్తున్న చిన్నారులు

వెల్గటూర్ : 'అమ్మా.. నాన్నకు ఏమైంది..? నాన్నాను ఎక్కడికి తీసుకెళ్తన్నారు.. ? మళ్లీ ఎప్పుడొస్తాడు..? అమ్మ ఎందుకు ఏడుస్తున్నావమ్మా..' అంటూ ఆ చిన్నారులిద్దరూ అమాయకంగా అడుగుతుంటే ఏమని చెప్పాలో తెలియక అక్కడున్న వారందరూ గుండెలవిసేలా రోదించారు. నాన్న దూరమై చిన్నారులు.. కట్టుకున్న వాడు దూరమై భార్య, వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కొడుకు దూరమై గుండెలవిసేలా ఏడుస్తున్న ఆ కుటుంబాన్ని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మూగల రవి (35) ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి మూడు నెలల క్రితమే ఇంటికొచ్చాడు. ప్రస్తుతం స్థానికంగా కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. అప్పటివరకూ అందరితో కలివిడిగా గ్రామంలో తిరిగిన రవి గుండెనొప్పి బారిన పడడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన జగిత్యాల ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. రవికి భార్య జ్యోతి (29), కూతుళ్లు శాన్వి (7), సమన్వి (4) ఉన్నారు. రవి తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. చివరి దశలో ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు దూరమై తల్లిదండ్రులు, తోడుగా ఉంటానని ప్రమాణం చేసిన భర్త మధ్యలోనే వదిలేసి వెళ్లడంతో వారి రోదనలు మిన్నంటాయి. తండ్రికి ఏమైందో తెలియని ఆ చిన్నారులు అమాయకంగా చూస్తుండడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది.

సింగరేణిని అగ్రస్థానంలో నిలపాలి

- సంస్థ సీఅండ్ఎండీ ఎన్.బలరాం


సీఅండ్ఎండీకి బొకే అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి స్థితిగతులను కార్మికులకు వివరిస్తూ సంస్థ పురోభివృద్ధి కోసం అధికారులు మరింత అంకితభావంతో పనిచేయాలని సీఅండ్ఎండీ ఎన్.బలరాం కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో అధికారుల సంఘం నాయకులతో సమావేశమయ్యారు. పోటీ మార్కెట్లో సింగరేణి సంస్థ నిలదొక్కుకోవాలంటే ఉత్పాదకత మరింత పెరగాలని, దీనికోసం ప్రతీ అధికారి, కార్మికుడు పూర్తి పని గంటలు సద్వినియోగం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ఉద్యోగులను చైతన్యపరుస్తూ ముందుకు నడపాలని సూచించారు. ఉత్పత్తి వ్యయం, బొగ్గు అమ్మకం, ప్రస్తుతం కంపెనీ ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితులు కూలకషంగా వివరించారు. సంస్థను అభివృద్ధి పథంలో నడపాలంటే ఇంకా చేపట్టాల్సిన నిర్మాణాత్మక చర్యలను సూచించాలని అధికారులు కోరారు. కంపెనీ లాభదాయకంగా నడిస్తే కార్మికులతో పాటు అధికారులకు కూడా తగిన విధంగా ప్రోత్సాహకాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈసందర్భంగా అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మీపతిగౌడ్, జనరల్ సెక్రెటరీ పెద్దినరసింహులుతో పాటు కమిటీ నాయకులు చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు.

అధికారులకు ప్రోత్సాహం కల్పించాలి

సంస్థ అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న అధికారులకు తగిన ప్రోత్సాహం కల్పించాలని సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్ కోరారు. అధికారులకు ఉచిత ల్యాప్‌టాప్‌లు అందజేయాలని, ఉన్నత చదువులు చదివే అధికారుల పిల్లలకు కార్మికులకు మాదిరిగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలన్నారు. సమావేశంలో కోఆర్డినేషన్ జీఎం ఎం.సురేష్, అధికారుల సంఘం ఉపాధ్యక్షులు పానుగోటి శ్రీనివాస్, పి.రాజీవ్‌కుమార్, సహాయ కార్యదర్శులు ఆర్.కిరణ్‌రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి మహోత్సవానికి రండి




మంత్రి శ్రీధర్‌బాబు, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆహ్వానిస్తున్న శ్రీనివాస్, ఎంపీని ఆహ్వానిస్తున్న అధికారులు

వేములవాడ: మహాశివరాత్రి వేడుకలకు రావాలని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వానించారు. జగిత్యాల జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కలిసి ఆహ్వానపత్రికలు అందించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు ఆహ్వానపత్రికను ఆలయ పర్యవేక్షకులు హరినాథ్ అందజేశారు.

విద్యుత్ షాక్‌తో గొర్ల కాపరి మృతి


కొమురయ్య(ఫైల్)


కొమురయ్య మృతదేహం

ఓదెల/జమ్మికుంట:: ఓదెల మండలం జీలకుంట గ్రామ శివారులో అబాది జమ్మికుంటకు చెందిన కొమ్ము కొమురయ్య (60) గొర్ల కాపరి విద్యుత్‌షాక్‌తో బుధవారం మృతి చెందాడు. పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్ము కొమురయ్యతో పాటు మరో ముగ్గురు పదిరోజుల క్రితం గొర్లను మేత కోసం జీలకుంటకు తీసుకొచ్చారు. గొర్లు మేత మేస్తుండగా కొమురయ్య బహిర్భూమికి వెళ్లాడు. జిలకుంటకుచెందిన బంగారి కొమురయ్య తన పంటలను అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు మొక్కజొన్న పంట చుట్టూ విద్యుత్ తీగ అమర్చాడు. బహిర్భూమికి వెళ్లిన కొమురయ్య పంటకు అమర్చిన విద్యుత్ వైర్‌కు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు సురేశ్, కూతురు ఉంది. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ వైరు రైతుపై కేసు

జీలకుంట గ్రామశివారులో అడవి పందులు, జంతువుల బారి నుంచి పంటలు కాపాడేందుకు విద్యుత్ వైరు అమర్చిన రైతు బంగారి కొమురయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

కొట్టి గాయపరచిన వ్యక్తికి ఆరు నెలల జైలు

బోయినపల్లి(చొప్పదండి): అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి ఒకరిని కొట్టి గాయపరచిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు వెలువరించినట్లు ఎస్సై ఎల్.శ్రీకాంత్ బుధవారం తెలిపారు. 2017 అక్టోబర్ 4న రత్నంపేటలో పెంచలయ్య ఇంట్లోకి బిచ్చు అనే వ్యక్తి అక్రమంగా ప్రవేశించి కర్రతో కొట్టాడు. తలకు గాయమైందని పెంచలయ్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, బిచ్చును కోర్టులో హాజరుపరిచారు. బిచ్చుకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై శ్రీకాంత్ వివరించారు.

కమిషనర్ కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం ముందు జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు కారును బుధవారం ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. అయితే ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కమిషనర్ కారు వెనుకభాగం దెబ్బతింది. ఘటనపై ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి వృద్ధుడి మృతి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతారాంపూర్ బాలాజీనగర్‌లో గల సుచిత్ర అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తు కామారపు రమేశ్(60) అనే వృద్ధుడు పడి మృతిచెందినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. కొత్తపల్లి పట్టణానికి చెందిన రమేశ్ ఏడాది క్రితం బాలాజీనగర్‌లోని సుచిత్ర అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేసి నివాసముంటున్నాడు. అతడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉండగా.. ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్నారు. అపార్ట్‌మెంట్‌లోని ఐదో అంతస్తులో ఉండే రమేశ్ బుధవారం కళ్లు కనిపించక ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో పడి రైతు..

వీణవంక: మండలంలోని శ్రీరాములపేట గ్రామానికి చెందిన రైతు కట్కూరి నారాయణరెడ్డి(73) మంగళవారం రాత్రి పంట పొలాలకు నీరు మళ్లించే క్రమంలో ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. పొలాలకు నీరు మళ్లించేందుకు మరో నాలుగురు రైతులతో కలిసి హిమ్మత్‌నగర్‌కు వెళ్లే కాలువ తూములో ఇరుకున్న చెత్తను తొలిగిస్తుండగా కాళ్లకు పారక చుట్టుకోవడంతో నీటిలో పడి కొట్టుకుపోయాడు. తోటి రైతులు అప్రమత్తమై వెంటనే బయటికి తీసి చికిత్స కోసం జమ్మికుంటకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడు..

జమ్మికుంట: ప్రమాదవశాత్తు చెరువులో పడి మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన కన్నెవేన కొంరయ్య అలియాస్ బక్కయ్య (68) జమ్మికుంట మున్సిపల్ నాయిని చెరువులో పడి చనిపోయాడు. ఇరవై ఏళ్లుగా ఇంట్లో నుంచి వెళ్లిపోయి రెండు, మూడు రోజులకు ఇంటికి తిరిగి వచ్చేవాడు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఓ రైతు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడి చెల్లి గంద్రకోట మధునమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు.

ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయానికి తాళం

- 14 నెలలుగా అద్దె చెల్లించని వైనం
- ఇంటి యజమానికి రూ.3.36లక్షల బకాయి
- ఎంపీటీసీ హామీతో తెరుచుకున్న కార్యాలయం


కార్యాలయానికి తాళం వేస్తున్న యజమాని

వెల్గటూర్ : జగిత్యాల జిల్లాలోని ఎండపల్లి తహసీల్దార్ కార్యాలయానికి బుధవారం భవన యజమాని తాళం వేశాడు. కొత్తగా ఏర్పడిన ఈ మండలంలో 21 అక్టోబర్ 2022న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా అద్దె భవనంలో తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలోని రాయిల్ల భూమేశ్‌కు చెందిన ఇంటిని నెలకు రూ.24వేల చొప్పున చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అప్పటినుంచి 14నెలలు గడిచినా అద్దె చెల్లించలేదు. బకాయి రూ.3.36లక్షలకు చేరింది. ఆ మొత్తం చెల్లించాలంటూ యజమాని భూమేశ్ కార్యాలయానికి ఉదయం తాళం వేశాడు. విద్యుత్ బిల్లు రూ.50 వేలకు చేరింది. కార్యాలయానికి తాళం వేయడంతో గంటపాటు సిబ్బంది బయటే వేచి చూశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఎంపీటీసీ బషీర్ హామీ ఇవ్వడంతో భూమేశ్ తాళాలు తీశాడు. పది రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపకుంటే తాళం వేస్తానని భూమేశ్ హెచ్చరించారు.

బాధ్యతలు స్వీకరించిన రాజన్న ఉత్సవ కమిటీ


కొలువుదీరిన కొత్త పాలకమండలి సభ్యులు

వేములవాడ: మహాశివరాత్రి జాతర ఉత్సవ కమిటీ బుధవారం బాధ్యతలు స్వీకరించింది. కమిటీ సభ్యులుగా అనుమల్ల చంద్రం(జగిత్యాల), వడ్డేపల్లి వెంకటరమణ(హుస్నాబాద్), కె.రాజిరెడ్డి(సిరిసిల్ల), సి.విజయలక్ష్మి(మంథని), సాగరం వెంకటస్వామి(వేములవాడ), పాత సత్యలక్ష్మి(వేములవాడ), కూరగాయల కొమరయ్య(వేములవాడ), సంద్రగిరి శ్రీనివాస్(వేములవాడ), కనికరపు రాకేశ్ (వేములవాడ), నాంపల్లి శ్రీనివాస్(నాంపల్లి), పులి రాంబాబు(వేములవాడ), తూము సంతోష్(వేములవాడ), వకుళాభరణం శ్రీనివాస్(నూకలమర్రి), పిల్లి కనకయ్య(రుద్రవరం), సంగ స్వామియాదవ్ (శాత్రాజుపల్లి), జగన్మోహన్‌రెడ్డి(నిజామాబాద్), చేపూరి గంగయ్య(నిమ్మపల్లి), చింతపంటి రామస్వామి(నర్సింగాపూర్), కాయితి నాగరాజు(దుంపేట), తొట్ల అంజయ్య(పోతారం), ఏనుగు రమేశ్‌రెడ్డి(దమ్మన్నపేట), సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి(మన్నెగూడం), ధార్న మల్లేశం(రుద్రంగి)లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఆలయ ఈవో కృష్ణప్రసాద్ సమక్షంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఫెస్టివల్ కమిటీ సభ్యులకు ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదం అందజేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫెస్టివల్ కమిటీ సభ్యులకు అభినందనలు తెలుపుతూ.. భక్తుల ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

వీణవంకలో దొంగ రిజిస్ట్రేషన్ కలకలం

వీణవంక(హుజూరాబాద్): అమెరికాలో ఉన్న మహిళ పేరిట ఉన్న భూమిని ఆమెకు తెలియకుండా ఇతరులకు దొంగ రిజిస్ట్రేషన్ చేసిన సంఘటన వీణవంక తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకుంది. తహసీల్దార్ తిరుమల్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వీణవంక శివారులో రెండు వేర్వేరు సర్వే నంబర్లలో రామిడి సుప్రియ పేరిట 22 గుంటల స్థలం ఉంది. ప్రస్తుతం సదరు మహిళ అమెరికాలో ఉంటోంది. మండలంలోని ధరణి మాజీ ఆపరేటర్ అరుణ్‌తోపాటు సుకాసి సురేశ్, నీల పూర్ణచందర్, మహ్మద్ అక్బర్‌లు కుమ్మక్కై ఆమె ఫొటోను తీసి, సంతకం ఫోర్జరీ చేశారు. తహసీల్దార్ విధుల్లో లేని సమయం చూసి సుకాసి సురేశ్‌కు పట్టా చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. వెంటనే తహసీల్దార్ తిరుమల్‌రావు స్థానిక పోసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

ధరణి ఆపరేటర్‌ను తొలగింపు

ఇటీవల తహసీల్దార్ తిరుమల్‌రావుకు తెలియకుండా గతంలో ఉన్న డిప్యూటీ తహసీల్దార్, ధరణి ఆపరేటర్ అరుణ్ కలిసి ఓ గ్రామానికి చెందిన కుటుంబానికి నిబంధనలకు విరుద్ధంగా ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ విషయంలో ధరణి ఆపరేటర్ అరుణ్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. డీటీని కలెక్టరేట్‌కు సరెండర్ చేశారు. దొంగ రిజిస్ట్రేషన్ విషయంలో ధరణి ఆపరేటర్‌పై మళ్లీ కేసు కలకలం రేపుతుంది.

పేద కుటుంబానికి పెద్ద ఆపద

- గోడ కూలి ఇంటిపెద్ద అకాల మరణం
- తల్లికి మాటలు రావు.. చెవులు వినిపించవు
- దిక్కుతోచని స్థితిలో ఇద్దరు కూతుళ్లు
- దాతలు ఆదుకోవాలని గ్రామస్తుల వేడుకోలు



దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్న తల్లీకూతురు

కాల్వశ్రీరాంపూర్: పొట్ట చేతపట్టుకొని వలస వచ్చిన పేద కుటుంబానికి పెద్ద ఆపద వచ్చింది. గోడ కూలి ఇంటి పెద్ద అకాల మరణంతో భార్య, ఇద్దరు కూతుళ్లు దిక్కులేనివారయ్యారు. తండ్రి మృతితో చెవిటి, మూగ అయిన తల్లికి తమ కష్టసుఖాలు ఎలా చెప్పుకునేది అంటూ.. ఇద్దరు ఆడపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

15ఏళ్ల క్రితం వలస వచ్చి..

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన నిమ్మ రవి(35) 15ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం తమ బంధువుల ద్వారా కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట గ్రామానికి వలస వచ్చాడు. అతడికి భార్య కోమల (చెవిటి, మూగ), ఇద్దరు ఆడపిల్లలు సాత్విక(ఇంటర్), శ్రావిత (9వతరగతి) ఉన్నారు. గుంట భూమి లేదు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబం. రవి వ్యవసాయ కూలీగా, ఐకేపీ వరిధాన్యం కొనుగోళ్ల సమయంలో హమాలీగా పనిచేసి కుటుంబాన్ని పోషించుకునేవాడు. అందరికీ తలలో నాలుకలా ఉండే రవి గత నెల 28న స్వగ్రామం కుందారంలో మల్లన్న దేవుడి బోనాల కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు గోడకూలి మృత్యువాతపడ్డాడు. అనంతరం మృతదేహాన్ని బంధువులు మీర్జంపేటకు తీసుకొచ్చి గ్రామస్తుల సాయంతో అంత్యక్రియలు జరిపించారు. పెద్దకూతురు సాత్విక తండ్రి అంత్యక్రియల్లో పాల్గొని పుట్టెడు దుఃఖంతో కరీంనగర్‌లో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాస్తోంది. చిన్న కూతురు శ్రావిత కస్తూరిబా పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. అన్నీ తానై చూసుకున్న ఇంటిపెద్ద అకాల మరణంతో తామెలా బతికేది, తమ చదువులెలా సాగేది అంటూ ఆ కుటుంబం తల్లడిల్లుతోంది. తమ చదువుల కోసం దాతలు తోచిన సాయం అందించి ఆదుకోవాలని ఆ కుటుంబం వేడుకుంటోంది. ఇటీవల అదే గ్రామానికి చెందిన దంపతులు డాక్టర్ పచ్చిక శ్రీకాంత్‌రెడ్డి-డాక్టర్ ప్రశాంతి రూ.50వేలు ఆర్థికసాయం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. ఆపదలో ఉన్న కుటుంబానికి ఆపన్నహస్తం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దాతలు సాయం చేయాల్సిన వారు
బ్యాంక్ అకౌంట్ నంబర్
62279304181
నిమ్మ కోమల
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీహెచ్‌వై0020388